క్లుప్తంగా

రేపు మున్సిపల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

ఇక అధికవేగంతో ఫైబర్ కనెక్షన్లు

నరసరావుపేట: పట్టణంలోని ఏప్రాంతంలోనైనా అధికవేగంతో ఫైబర్ కనెక్షన్లు పొందవచ్చని బీఎస్ఎన్ఎల్ గుంటూరు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం కోట సెంటరులోని బి.యస్.యన్.యల్ టెలిఫోన్ ఎక్చేంజ్‌లో ఓ.ఎల్.టిని ప్రారంభించారు. దీని వలన నగరంలోని ఏ ప్రాంతంలో అయినా అధిక వేగంతో ఫైబర్ కనెక్షను ఇవ్వవచ్చన్నారు. దీని ద్వారా ల్యాండ్ ఫోను, అధిక వేగంతో డేటా సౌకర్యం పొందే అవకాశం ఏర్పడిందన్నారు.

ఘనంగా మాజీ మంత్రి కాసు జన్మదినం



నరసరావుపేట: మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి 77వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన ఆయన అభిమానులు పలువురు హైదరాబాదులోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియచేసి ఆయన చేత కేకు కట్ చేయించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో పడాల చక్రారెడ్డి, యన్నం రవీంద్రరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఫరీదు, కరిముల్లా, సాంబశివరావు, ఆంజనేయులు, చెంచిరెడ్డి ఉన్నారు.

పీవీ సురేష్‌కు డాక్టరేట్ అవార్డు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన సమాజ సేవకుడు రక్తదాత, బెస్ట్ సోషల్ యాక్టివ్ వర్కర్ అవార్డు గ్రహీత పి.వి.సురేష్ బాబుకు గౌరవ డాక్టరేట్ అవార్డు లభించింది. ఢిల్లీలోని అశోక హోటల్ నందు ప్రతిష్ఠాత్మక వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కమిషన్ వారిచే నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ అవార్డును కేంద్రమాజీ మంత్రి షహనాజ్ హుస్సేన్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు పొందిన పీవీ సురేష్‌బాబును పలువురు అభినందించారు.


ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన హిందీ ఉపాధ్యాయుడు అనుపోజు సోమ సూర్యప్రకాష్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వి.నరసింహారావు, లక్ష్మి, వై.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ వన్ను కృష్ణయ్య, గ్రామపెద్దలు పేరేశ్వరరావు, శ్రీనివాసరావు, హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో పోష్టికాహార ర్యాలీ

వినుకొండ(నూజెండ్ల): పోష్టికాహార మాసోత్సవాల సందర్భంగా నూజెండ్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ విన్నాసమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వాణి, పద్మావతి, లక్ష్మీరాజ్యం, అంజలి, అనురాధ, నాగవల్లి, శకుంతల, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి సహకరిస్తాం



నరసరావుపేట: వినుకొండ రోడ్డు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వివిధ దశలో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను ఆదేశించారు. శనివారం జగనన్న కాలనీలో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షతన నిర్వహించిన మనఇల్లు మనగౌరవం కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని హాజరయ్యారు. తహసీల్దార్ వేణుగోపాలరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, టీడీపీ నాయకుడు గంగుల పెద్దిరెడ్డి, గృహనిర్మాణశాఖ అధికారులు, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యాన్ని సహించను

పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు పంపాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. శనివారం ఉదయం పట్టణంలో కార్మికులు చేస్తున్న పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

5కే వాక్‌ను జయప్రదం చేయండి

నరసరావుపేట: ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి రోడ్డులోని కోడెల శివప్రసాదరావు స్టేడియం నుంచి ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే 5కే వాక్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని మహాత్మాగాంధీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

స్వామి.. చంద్రబాబుకు సద్బుద్ధినివ్వు..

- టీటీడీ లడ్డూ ప్రసాదంపై ఆరోపణలు దురదృష్టకరమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- సీఎం చంద్రబాబు చేసిన పాప పరిహారానికి పూజలు
- రెడ్డినగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో కొబ్బరికాయలు కొట్టిన నాయకులు
- వేర్వేరు ప్రాంతాల్లో పూజలు చేసిన పార్టీ శ్రేణులు



నరసరావుపేట అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు



వినుకొండలో మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు, గౌతమ్‌రెడ్డి

నరసరావుపేట: ఎక్కడా కల్తీ జరగని లడ్డూ ప్రసాదాన్ని కల్తీ జరిగినట్లుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్న మాటలతో కలియుగ శ్రీ వైకుంఠ దేవుడు తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామికి తీవ్ర అపచారం జరిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. దీనికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రే వహించాలని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెడ్డినగర్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ శ్రేణు లు చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేయాలని భగవంతుని ప్రార్థించారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు చేసి భక్తి శ్రద్ధలతో టెంకాయలు కొట్టారు. ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఇయం.స్వామి మీడియాతో మాట్లాడుతూ స్వామి వారి లడ్డు ప్రసాదంపై విమర్శలు రావడం చాలా దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రతిష్ఠను కించపరిచే విధంగా సంఘటనలు జరగటం అందరికీ బాధ కలిగిస్తుందన్నారు. పాఠశాలల్లో చిన్న పిల్లలకు భోజనం అందించేందుకు ఎంతో జాగ్రత్తలు తీసుకు న్నా మంచి మనసున్న మాజీ సీఎం జగన్ సాక్షాత్తు భగవంతుని ప్రసాదమైన లడ్డుని ఏవిధంగా కల్తీ చేస్తారని ప్రశ్నించారు. ఈ ఆరోపణ ఎంతవరకు సమంజసమన్నారు. కూటమి నాయకులు అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు ఎన్నో హామీలు, వాగ్దానాలు చేశారని, ఇప్పటికీ వంద రోజులు గడిచిపోయినా ఆ హామీలు నెరవేరలేదని, వాటికోసం కృషిచేయాలని సూచించారు. పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షులు పడాల శివారెడ్డి మాట్లాడు తూ టీటీడీ ఈవో కల్తీ నెయ్యిని వాడలేదు వెనక్కి పంపించామని చెబితే, సీఎం చంద్రబాబు నాయు డు మాత్రం ఈ కల్తీ నెయ్యిని వాడేమని చెబుతున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రసా దం కల్తీ జరిగిందని పశ్చాత్తాపం చెందుతున్నానని అంటూ దీక్షలు చేస్తున్నారని, వాళ్ళే తప్పు చేసి.. వాళ్లే పశ్చాత్తాప దీక్షలు చేయడమేమిటని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ భార్య కూడా క్రిస్టియన్ అని, తిరుమలకు వెళ్లిన సమయంలో డిక్లరేషన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సీబీఐ, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ, సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని, లేని పక్షంలో మన రాష్ట్ర పరువు, టీటీడీ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరించారు. నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ..

భారత రాజ్యాంగం ప్రకారం ఏమతం వారైయినా, ఎవరైనా దేవాలయాలు సందర్శించవచ్చని భారతదేశంలో లౌకిక వాదం ప్రకారం మత స్వేచ్ఛ ఉందన్నారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే డిక్లరేషన్ డ్రామా తెరపైకి తెచ్చారన్నారు. అందుకే జగన్ పిలుపు మేరకు ఆలయాల్లో రాష్ట్రవ్యాప్తంగా పూజలు చేస్తున్నట్లు చెప్పారు.

నెయ్యిలో కల్తీ అసాధ్యం

30 ఏళ్ల డెయిరీ రంగంలో అనుభవం ఉన్నవ్యక్తిగా చెబుతున్నానని నెయ్యిలో ఇతర కొవ్వు పదార్థాలు కలిపితే దుర్వాసన వస్తుందని ఇన్నేళ్లు ఏఒక్క భక్తుడు కూడా ఆరోపణ చేయలేదని కావాలనే చంద్రబాబు లడ్డూ వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని కుటిల రాజకీ యం చేస్తున్నారన్నారు. గతంలో పేరు ఉన్న అమూల్ వంటిడెయిరీలు మాత్రమే టీటీడీ టెండర్లలో పాల్గొనే వారని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ట్రేడర్లు కూడా టెండర్లలో పాల్గొనవచ్చని నిబంధనలు మార్చారని అందువల్లనే నిల్వ ఉన్న నెయ్యిసరఫరా అయిందని అధికారులు గుర్తించి నెయ్యిని వాడలేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బేతం గాబ్రియేలు సీనియర్ నాయ కులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, సర్పంచ్‌లు కోపెలదేవరాజ్, పరిమిశేషయ్య, న్యాయవాది ఎం.ఎస్.వార్డుకౌన్సిలర్, సానాల పుల్లయ్య, ప్రసాదు, పులిపాటి రామారావు, లింగరాజు, మూర్తి, అబ్బూరి శ్రీను, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: మండలంలోని గోవిందపురం గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదాన్ని చంద్రబాబునాయుడు అపవిత్రం చేసిన పాపానికి ప్రక్షాళన కోరుతూ మండల పార్టీ అధ్యక్షులు గుత్తా యాములయ్య ఆధ్వర్యంలో పూజలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అబ్బూరి సుబ్బారావు, గుత్తా రాగయ్య, మెట్టు శ్రీనివాసరెడ్డి, దేవరపల్లి సూరారెడ్డి, కల్లం చంద్రశేఖర్, కల్లం సుబ్బారెడ్డి, సాంబిరెడ్డి, మండాది శ్రీనివాసరావు, గుత్తా శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

యడ్లపాడులో...

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు సద్బుద్ధిని ప్రసాదించాలని యడ్లపాడు మండలంలోని బోయపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంట శంకర్, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, వడ్డేపల్లి నరసింహారాజు, బసల శివరామకృష్ణ, చాగంటి శ్రీధర్, షేక్ రసూల్, షేక్ జాకీర్, షేక్ షంషూ జూహ, పల్నాటి గురవయ్య, పఠాన్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

బాబుని వెంకన్న స్వామి క్షమించడు

వినుకొండ(నూజెండ్ల): తిరుమల పవిత్రతను దెబ్బతీసేవిధంగా అసత్యప్రచారాలు చేయడమే కాకుండా సీనియర్ నాయకుడని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునును ఆ వెంకటేశ్వర స్వామి క్షమించడని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు పి.గౌతమ్‌రెడ్డితో కలసి పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయంలో పూజలు చేశారు. చంద్రబాబుకు మంచిబుద్ధిని ప్రసాదించాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లేనినెయ్యిని, తయారు కాని లడ్డూని వివాదం చేస్తూ చంద్రబాబు తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలుపుతున్నారని ప్రచారం చేయడం దారుణమన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా అసత్యప్రచారం చేయడం దారుణమన్నారు. జూలై 15వ తేదీన ల్యాబ్‌రిపోర్టు ఆధారంగా చంద్రబాబు ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అప్పుడు టీడీపీ అధికారంలో ఉందని గుర్తుచేశారు. నెయ్యి నాణ్యత లేదని గుర్తించిన అధికారులు నెయ్యిని తయారీలో వాడలేదని లడ్డూ తయారీ చేయలేదని తెలిసి కూడా అర్థరహిత ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు.

తిరుమలలో అధికారులు నెయ్యిలో కల్తీలేదని రిపోర్టు ఇచ్చినా పదేపదే ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేయడాన్ని ఖండించా రు. చేసిన తప్పును అసత్య ప్రచారాలను ప్రజలు గుర్తించారని దీంతో మరలా జగన్ తిరుమల యాత్రను అడ్డుకుంటూ డిక్లరేషన్ డ్రామాకు తెరదీశారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలలో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధికోసమే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారన్నారు.

మానవతావాది జాషువా



వినుకొండలో జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా, గౌతమ్‌రెడ్డి

నరసరావుపేట ఈస్ట్: తన కవిత్వంతో సమాజాన్ని చైతన్యపరిచిన గుర్రం జాషువా గొప్ప మానవతావాది అని వక్తలు పేర్కొన్నారు. శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాషువా 129వ జయంతి నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కవి కరిముల్లా, పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ కె.సుధాకర్, దీప, పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి, సీనియర్ ఆడిటింగ్ అధికారి షేక్.బాజీ తదితరులు మాట్లాడుతూ, జాషువా తన సాహిత్యంతో చేసిన సామాజిక సేవను వివరించారు.

వినుకొండ(నూజెండ్ల): మహాకవి గుర్రం జాషువా జయంతి వేడుకలు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు గౌతమ్‌రెడ్డిలు పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో నవయుగ కవి చక్రవర్తి, కవికోకిల గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెనాలి సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, గుర్రం జాషువా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరిశపోగు సునీల్‌కుమార్ ఎ కార్యక్రమంలో న్యాయవాది కాకాని నాగేశ్వరరావు మాదిగ, మాజీ జడ్పీటీసీ, గుర్రం జాషువా ఫౌండేషన్ సభ్యుడు బందెల కన్నయ్య మాదిగ, మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు స్వర్ణ మునలయ్య మాదిగ, వేల్పుల పేరయ్య మాదిగ, ఆలేటి యల్లయ్య, గ్రామసర్పంచ్ పల్లమీసాల చెంచయ్య, ఎ.జోషప్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట: గుర్రం జాషువా కవితలు సామాజిక చైతన్య వీచికలని పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా జయంతిని శనివారం నిర్వహించారు. ముందుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

నరసరావుపేట: మహాకవి గుర్రం జాషువా గారి 129వ జయంతి వేడుకలను గోపిరెడ్డి యువసేన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పల్నాడురోడ్డులోని గుర్రం జాషువా గారి విగ్రహానికి అధ్యక్షులు పంగులూరి విజయకుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వినుకొండ(నూజెండ్ల): మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు

- అక్టోబర్ 7 నుంచి మూడు రోజులు కార్యక్రమాలు
- ఎన్ఈసీలో ఏర్పాట్లు పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



బృందానికి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు

నరసరావుపేట రూరల్: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఇస్రో, శ్రీహరికోట ఆధ్వర్యంలో అక్టోబర్ 7 నుంచి 9వ తేదీ వరకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. మెగా ఈవెంట్‌లో భాగంగా రాకెట్ నమూనాలు, స్పేస్ వీడియో షోలు, ప్రముఖ శాస్త్రవేత్తల ఉపన్యాసాలు, అంతరిక్ష కార్యకలాపాలు, వాటి ఉపయోగాలను వివరిస్తారని తెలిపారు.

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు క్విజ్, డ్రాయింగ్, వకృత్వం వంటి పోటీలు నిర్వహిస్తారని వివరించారు. అంతరిక్షంలోని అద్భుతాలను అన్వేషించేందుకు ఇస్రో కల్పిస్తున్న అవకాశాన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఇస్రో శాస్త్రవేత్తల బృందం కళాశాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించడం జరిగిందన్నారు.



చికిత్స పొందుతూ మహిళ మృతి



గాయాలు పాలైన సుమతి

రొంపిచర్ల: మండలంలో తురుమెళ్ళ గ్రామానికి చెందిన ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఈ ప్రమాదం శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై మండలంలోని సంతగుడిపాడు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో తురుమెళ్ళ గ్రామానికి చెందిన గంగవరపు సుమతి (60), ఆమె భర్త లింగారావు శుక్రవారం బైక్ మీద సంతగుడిపాడు గ్రామంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌కు వెళ్లి పనులు ముగించుకొని సాయంత్రం తిరిగి తమ స్వగ్రామానికి వస్తున్నారు. అయితే హైవే రోడ్డు మీదుగా వస్తున్న వీరి బైక్‌ను వెనుక వైపు నుండి గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమతి బైక్ మీద నుండి క్రింద పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె భర్త లింగారావుకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఆమెకు స్థానికులు చికిత్స నిమిత్తం 108 ద్వారా నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

స్వర్ణాంధ్ర-47కు సలహాలు, సూచనలు అందించండి

నరసరావుపేట రూరల్: స్వర్ణాంధ్రప్రదేశ్-2047లో ప్రజలందరూ భాగస్వాములై అమూల్యమైన సలహాలు అందించాలని మండల పరిషత్ అధికారిణి టీవీ కృష్ణకుమారి తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికపై శనివారం ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి అధ్యక్షతన మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కృష్ణకుమారి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ఉద్యాన అధికారి నవీన్‌కుమార్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలి

నాదెండ్ల: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించి వారు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వర్లు చెప్పారు. యడ్లపాడు మండల విద్యాశాఖ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎంపీపీ యూపీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన అమలు, పాఠ్యాంశాల బోధన, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంఆర్‌సీలో హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

చిలకలూరిపేట: విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో బీఆర్‌ఏజీ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 130 మంది విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. దీంతో పాటు ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థిని ఒకరికి రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

విద్యార్థులు మంచి లక్షణాలు అలవర్చుకోవాలి

డీఎస్పీ నాగేశ్వరరావు



విద్యార్థి తండ్రి పూర్ణచంద్రరావువును సత్కరిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు మంచి లక్షణాలు అలవరుచుకుని క్రమశిక్షణ తో కూడిన విద్యను అభ్యసించాలని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో పారా గోపయ్య 26వ వర్థింతి వేడుకలు సందర్భంగా స్మారక ప్రతిభా పురస్కార్ ప్రధానోత్సవం కార్యక్రమంలో భాగంగా 7,10 తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదుతో మొమెంటులతో అందజేశారు. ఈ సందర్భంగా నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరావు మాట్లాడుతూ డాక్టరు అబ్దుల్ కలాం ఆశయ సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో వేల్పూరు హైస్కూలో పదోవ తరగతిలో 24 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించటం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శమన్నారు. అలాగే 12 మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తేవటం అభినందనీయమన్నారు. అనంతరం పదోవ తరగతి పరీక్షలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన పోత్తూరి భువన సాయి సుబాష్ తండ్రి వెంకట పూర్ణచంద్రరావును మెమెంటోతో పాటు నగదు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మ ద్ సుభాని, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గన్నవరపు శ్రీనివాసరావు, విశ్రాంత డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

యువతకు ఆదర్శనీయుడు భగత్‌సింగ్

చిలకలూరిపేట: యువతకు ఆదర్శం సర్దార్ భగత్ సింగ్ అని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం తృణ ప్రాయంగా భగత్‌సింగ్ ప్రాణాలను అర్పించారని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పేలూరి రామారావు, తాళ్లూరి బాబురావు, ఆరాధ్యుల రామకృష్ణ, తన్నీరు వెంకటేశ్వర్లు, మేకపోతుల నాగేశ్వరరావు, కట్టా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేలూరులో కంటి వైద్య శిబిరం

మండలంలోని వేలూరు గ్రామంలో అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నరసరావుపేట ఎంవీ రెడ్డి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుబాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, కందిమళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.